సాక్షి ప్రకాశం

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ప్రభుత్వం మాది.. మీకెందుకు ఎస్ఎంసీ చైర్మన్

ముండ్లమూరు మండలం పలుకురాళ్ల ఎస్ఎంసీ చైర్మన్ వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది.

- 8లో..



తాగునీరు స్వాహా !

టంగుటూరు మండలం మర్లపాడులో టీడీపీ నాయకుడి వికృత చేష్టలకు గ్రామస్తులు అల్లాడుతున్నారు. సాగర్ నీటిని దారి మళ్లించి కొణిజేడు చెరువుకు తరలిస్తున్నాడు. - 8లో..

గరిష్టం/కనిష్టం 25/18

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

సింగరాయకొండ: జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సెప్టెంబరు 2వ తేదీ సోమవారం డాక్టర్ వైఎస్సార్ 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ విగ్రహాలకు రంగులు వేసి పూలమాలలతో అలంకరించి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, అన్నదానాలు చేయాలని ఆయన సూచించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ 3 ఏ సైడ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సెప్టెంబర్ 9న కావలి దామిశెట్టి బాల సురేష్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా త్రీ ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ బాధ్యుడు సురేష్ రెడ్డి తెలిపారు. పోటీల్లో ఎంపికకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, నాలుగు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 20, 22 తేదీల్లో మహారాష్ట్రలోని షిరిడీ ఆత్మమాలిక్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి త్రీ ఏ సైడ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని సంఘం ప్రతినిధి సురేష్ రెడ్డి చెప్పారు. పూర్తి వివరాలకు 8790495111ను సంప్రదించాలని కోరారు.

మూడోసారి వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికలు

ఒంగోలు సెంట్రల్: పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు జిల్లాలో మరోసారి కొన్ని చోట్ల వాయిదా పడ్డాయి. ఎన్‌డీఏ కూటమి సభ్యులు ఎస్ఎంసీ ఎన్నికల్లో బలం లేకపోయినా అధికారంతో కైవసం చేసుకోవటానికి అనేక చోట్ల ప్రయత్నించారు. అయితే పలు చోట్ల తీవ్రంగా వ్యతిరేకించి ప్రతిపక్ష పార్టీ సభ్యులు కైవసం చేసుకున్నారు. అయితే ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఎన్నికల్లో శనివారం రెండో విడత 20 పాఠశాలల్లో నిర్వహించగా అందులో కేవలం 8 పాఠశాలల్లో ఎన్నిక పూర్తికాగా, మరో 12 పాఠశాలల్లో సరైన కోరం లేక వాయిదా పడ్డాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి ఈ వాయిదా పడిన ఎన్నికలు నిర్వహించేందుకు తేదీలు ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

కలప దొంగలపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: కలికవాయ-బిట్రగుంట చెరువులో కలప నరికేసిన ఆనవాళ్లు ఉన్నాయని 'సాక్షి'లో శనివారం వచ్చిన 'పచ్చ తమ్ముళ్ల ధన దాహం - తుమ్మ చెట్లు మాయం' శీర్షికన వచ్చిన కథనం వాస్తవమేనని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సి నాగమురళీమోహన్ ధ్రువీకరించారు. పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ సమన్వయంతో కలప అక్రమంగా తరలించిన వారిపై తదుపరి చర్యల కోసం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నట్లు ఆయన వివరించారు. చెరువులో మళ్లీ కలప దొంగతనం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక వాయిదా

ఒంగోలు సెంట్రల్: నేడు జరగాల్సిన అండర్-14 బాలుర ప్రకాశం జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక అల్పపీడనంతో కురుస్తున్న వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలో మళ్లీ ఎంపిక తేదీలు ప్రకటిస్తామని చెప్పారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

- కనిష్ట ధర రూ.194

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధరలు శనివారం గరిష్టంగా కేజీ రూ.358 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 11,325 బేళ్లు రాగా 9,055 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2,270 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 145వ రోజు వేలం పాటలో 5,344 బేళ్లు రాగా 4,552 వ్యాపారులు కొనుగోలు చేశారు. 792 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్టంగా రూ.190 సరాసరి రూ. 316.83 వచ్చింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 139వ రోజు వేలం పాటలో 5,981 బేళ్లు రాగా 4,503 బేళ్లు కొనుగోలయ్యాయి. 1,478 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి రూ.281.88 పలికింది.

కుండపోత

జిల్లా వ్యాప్తంగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఆగకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఆది, సోమవారాల్లో వానలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేసింది. తీరప్రాంతవాసులను అప్రమత్తం చేసింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం కొత్తపట్నం మండలంలోని పలు లోతట్టు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. రాచర్ల మండలం నెమలిగుండం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రంగ స్వామి ఆలయానికి వచ్చిన 40 మంది భక్తులు చిక్కుకుపోయారు. అధికారులు వారిని ట్రాక్టర్ల ద్వారా సురక్షితంగా తరలించారు.



ఒంగోలు రిమ్స్ ఎదురుగా చేరిన వర్షం నీరు

- జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- లోతట్టు ప్రాంతాలపై యంత్రాంగం ప్రత్యేక పరిశీలన
- సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- అత్యధికంగా ముండ్లమూరులో 147.2 మి.మీ వర్షం
- జిల్లా వ్యాప్తంగా సరాసరి 70.8 మి.మీ వర్షపాతం నమోదు



బొల్లుపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు

ఒంగోలు అర్బన్/ఒంగోలు సెంట్రల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన వర్షం విడవకుండా పడుతూనే ఉంది. ఆది, సోమవారాల్లో సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. వర్షం కారణంగా జిల్లా కేంద్రం ఒంగోలులో పలు కాలనీలు, నగరంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియా తీర ప్రాంతాల్లోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాసం కల్పించేందుకు తుపాను షెల్టర్లను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, మత్స్యశాఖ, ఆర్అండ్‌బీ, విద్యుత్, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, చలిగాలుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ప్రజలకు సూచిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కంట్రోలు రూమును ఏర్పాటు చేశారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే 1077 టోల్ ఫ్రీ నెంబర్‌కు చేయాలని అధికారులు తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్లతో సమీక్షించారు. అదేవిధంగా రాష్ట్ర హోం మంత్రి అనిత కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి వర్షాభావం తగ్గేవరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాచర్ల మండలం నెమలిగుండం వాగు ఉధృతంగా ప్రవహించడంతో రంగస్వామి ఆలయానికి వచ్చిన 40 మంది భక్తులు చిక్కుకు పోయారు. వారిని సురక్షితంగా ట్రాక్టర్ల ద్వారా తరలించిన పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు.



మార్కాపురంలో వర్షం పడటంతో నిలిచిపోయిన నీరు

ఖరీఫ్‌కు అనుకూలం..

ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, కొర్ర, పచ్చపెసర, కంది, మినుము, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆముదాలు, పత్తి, పొగాకు, టమోటాకు అనుకూలమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలతో మరింత సాగు పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఉధృతంగా జంపలేరు

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలో జంపలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లమల అటవీ ప్రాంతంలోని పైఎత్తున కురిసిన వర్షాలకు జంపలేరు వాగులో ప్రవాహం ఉధృతంగా ఉంది. గుండ్లబ్రహ్మేశ్వరం నుంచి బొల్లుపల్లె, పాపినేనిపల్లె, అర్ధవీడు, అయ్యావారిపల్లె, పెద్ద కందుకూరు, మొహిద్దీన్‌పురం వద్ద కంభం చెరువులోకి నీరు చేరుతోంది. బొల్లుపల్లెలోని పెద్ద చెరువు, చిన్న చెరువు నిండింది. అర్ధవీడులోని చెరువు సగానికి నిండిపోయింది.

పశ్చిమాన ఎడతెరపిలేని వర్షం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. మార్కాపురంతోపాటు, తర్లుపాడు, కంభం, బేస్తవారిపేట, పెద్దారవీడు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, అర్ధవీడు, గిద్దలూరు, కొమరోలు తదితరప్రాంతాల్లో నిరంతరాయంగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. పట్టణంలో దాదాపుగా జనజీవనం స్తంభించిపోయింది. నిరంతరంగా వర్షం కురుస్తుండటంతో చిరువ్యాపారులు, పూలు, పండ్ల వ్యాపారులు, హోటల్స్, తదితర చిరువ్యాపారాలు మూతపడ్డాయి.

మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు

మండల స్థాయిలో అధికారులతో జిల్లా కలెక్టర్ బృందాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మండల స్థాయిలో కంట్రోలు రూములు అందుబాటులోకి తెచ్చారు. మండల స్థాయి బృందంలో తహశీల్దారు/మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో ఎంపీడీఓ, ఎస్‌హెచ్ఓ, పంచాయతీరాజ్ ఏఈ, మండల వ్యవసాయ శాఖ అధికారి, మెడికల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ, ఈఓపీఆర్, మండల పశుసంవర్ధక అధికారి, మత్స్యశాఖ అధికారి, మండల ఫైర్ ఆఫీసర్‌లు సభ్యులుగా ఉంటారు. వీరు ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ముంపు ప్రాంతాలు పరిశీలన, రోడ్లు, డ్రైన్‌లు ఇతర సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా పనిచేసేలా ఆదేశాలిచ్చారు.

జిల్లాలో సరాసరి 70.8 మి.మీటర్ల వర్షపాతం

జిల్లాలో శనివారం సాయంత్రం 6.30 గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా సరాసరి 70.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముండ్లమూరు మండలంలో 147.2 మి.మీటర్ల వర్షపాతం కురిసింది. అదేవిధంగా యర్రగొండపాలెం 79, పుల్లలచెరువు 97.2, త్రిపురాంతకం 125.6, దోర్నాల 77.2, పెద్దారవీడు 58.8, దొనకొండ 94, కురిచేడు 113.4, దర్శి 80.8, మార్కాపురం 86, అర్ధవీడు 34.6, కంభం 62.8, తర్లుపాడు 34.6, కొనకనమిట్ల 81.2, పొదిలి 81.4, తాళ్లూరు 117.6, నాగులుప్పలపాడు 124.8, మద్దిపాడు 124.4, చీమకుర్తి 92, మర్రిపూడి 52.6, హనుమంతునిపాడు 63, బేస్తవారిపేట 56, రాచర్ల 50.6, గిద్దలూరు 48.4, కొమరోలు 27.2, వెలిగండ్ల 56.4, కనిగిరి 58.2, కొండపి 60.2, సంతనూతలపాడు 65.6, ఒంగోలు 85.8, కొత్తపట్నం 55.6, టంగుటూరు 34.8, జరుగుమల్లి 42.6, పొన్నలూరు 39.2, పెదచెర్లోపల్లి 40.8, సీఎస్‌పురం 44, పామూరు 53.8, సింగరాయకొండ 42.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరాసరి 70.8 మి.మీటర్లు నమోదైంది.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

- లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- మత్స్యకారులు వేటకు వెళ్లవద్దు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



కె.మోటుమాలలో తుఫాన్ షెల్టర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం: జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా మండలంలో శనివారం పర్యటించారు. కె.పల్లెపాలెం, మోటుమాల తుఫాన్ షల్టర్ కేంద్రాలను పరిశీలించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు పునరావాసం కల్పించేలా తుఫాన్ షెల్టరు కేంద్రాలను శుభ్రం చేయించాలన్నారు. జనరేటర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు చేసిందని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉండాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు, గర్భిణుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటలూ పనిచేస్తుందన్నారు. కంట్రోల్ రూమ్ సోమవారం వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయం, మత్స్యకార, ఆర్అండ్‌బీ, విద్యుత్, పశుసంవర్ధక, వైద్య శాఖల ఉద్యోగులు ఇందులో పనిచేస్తారని తెలిపారు. వర్షాల వలన ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు 1077 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూములో పనిచేసే సిబ్బంది ఈ సమస్యను నమోదు చేసుకుని సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సముద్రం అలల ఉధృత తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించారు. కలెక్టర్ వెంట జేసీ ఆర్ గోపాల్ కృష్ణ, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, ఎంపీడీవో పి.సుజాత, మత్స్యకార అధికారులు పాల్గొన్నారు.



నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రంలో ఉధృతంగా ఉన్న జలపాతం



నగరంలో కురుస్తున్న వాన



మార్కాపురంలో నిరంతరంగా కురుస్తున్న వర్షం



గొట్లగట్టులో పాఠశాలకు వర్షంలోనే వెళ్తున్న విద్యార్థులు



వైపాలెంలో బొప్పాయి పంటలో చేరిన వర్షం నీరు

పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మరణించినవారు, పదవీ విరమణ చేసిన వారి కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ మరణించడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని, సర్వీసులో లేకపోయినా వారంతా పోలీసు కుటుంబ సభ్యులే అని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరఫున రావలసిన ప్రయోజనాలను వెంటనే అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో మరణించిన అబ్దుల్ రహీం సతీమణి షేక్ షాహిన్‌కి రూ.25 వేల చెక్కును అందజేశారు. అలాగే నెమలి రెడ్డి సతీమణి రాధకు రూ.25 వేల చెక్కు, హోంగార్డు బి.డేవిడ్ సతీమణి బి.శారదకు వెల్ఫేర్ ఫండ్ కింద రూ.15 వేలు, హోంగార్డు కొండలరావు సతీమణి మాధవికి రూ.10 వేల చెక్కులను అందజేశారు. తొలుత సిబ్బంది యోగక్షేమాలను వాకబు చేశారు. వారికి రావలసిన రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వం నుంచి రావలసిన రాయితీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఫైళ్లను వెంటనే పూర్తి చేయాలని డీపీవో అధికారులను ఆదేశించారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య వివరాలను తెలుసుకొని పలు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఓ యం.సులోచన, ఆర్ఐ సీతారామిరెడ్డి, డీపీఓ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పరీక్షలు రద్దు చేయాలి

ఒంగోలు టౌన్: తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని, అన్నీ రకాల పరీక్షలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వినోద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు జిల్లా అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు ప్రమాదంలో పడకుండా సెలవులు ప్రకటించాలని, జీఎన్ఎం, ఐటీఐ పరీక్షలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

అనుమతులొస్తే పని మొదలుపెడతాం..

- "రోడ్డు సరే .. మరి మాకేంటి?" కథనానికి స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

టంగుటూరు: ''రోడ్డు సరే ..మరి మాకేంటి?'' శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్, పీఐయూ అధికారులు స్పందించారు. టంగుటూరు మండలంలోని వెలగపూడి - అనంతవరం-ఆలకూరపాడు రోడ్డు నూతనంగా నిర్మించేందుకు అంచనా రూ.4.05 కోట్లతో పని ప్రారంభించి జీఎస్‌బీ లేయర్ వరకు పూర్తి చేశామని, రోడ్డులో ప్రజలు అదనంగా కల్వర్టులు నిర్మించవల్సిందిగా కోరారన్నారు. కల్వర్టులతో కలిపి వర్కింగ్ ఎస్టిమేట్ ప్రధాన ఇంజినీరుకి పంపించామని చెప్పారు. వర్కింగ్ ఎస్టిమేట్‌కు సాంకేతిక అనుమతి లభించిన వెంటనే మిగిలిన పనిని మొదలుపెట్టి పూర్తిచేస్తామన్నారు.



వెలగపూడి-అనంతవరం-ఆలకూరపాడు రోడ్డు

ఎస్‌బీఐ ట్రేడింగ్ పేరుతో రూ.20 లక్షలకు కుచ్చుటోపి

ఒంగోలు టౌన్:

ట్రేడింగ్ యాప్‌లో భారీ మొత్తంలో డిపాజిట్ చేసిన ఒక వ్యక్తి నిండా మునిగాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన కె.ఓబులేసు కొద్దిరోజుల క్రితం ఎస్‌బీఐ ఐఎన్‌టీ వెబ్‌సైట్ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా సంప్రదించారు. ట్రేడింగ్ అకౌంటు తెరచి డబ్బులు బదిలీ చేస్తే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మబలికారు. స్టేట్ బ్యాంకు పేరుతో యాప్ ఉండడంతో ఆయన నిజమని నమ్మేశారు. ఏకంగా రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆ తరువాత వాట్సప్ ద్వారా స్టాక్ అప్‌డేట్‌లను అందించడమే కాకుండా ఎప్పటికప్పుడు అంచనా లాభాలను చూపించారు. అయితే వచ్చే లాభాలను అకౌంట్‌లోకి మార్చడానికి వీలులేదని చెప్పడంతో ఆయనకు అనుమానం వచ్చింది. దాంతో వెబ్‌సైట్ గురించి మరింత లోతుగా పరిశీలించడంతో అసలు విషయం బయటపడింది. ప్లేస్టోర్ నుంచి బాధితుడు డౌన్లోడ్ చేసుకున్న ఎస్‌బీఐ ఐఎన్‌టీ అప్లికేషన్ వారం తరువాత మాయమైంది. మోసం జరిగినట్లు గ్రహించిన ఆయన వెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వై.నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పెద్దనాగులవరం చెరువు పరిశీలన



చెరువు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ వెంకట సునీల్, తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: మండలంలోని పెద్దనాగులవరం చెరువుకు వర్షపు నీరు చేరి ప్రమాదకర పరిస్థితి నెలకొనడంతో రైతు సంఘం నేత గాలి వెంకటరామి రెడ్డి ఒంగోలుకు కలెక్టరేట్‌కు సమాచారమిచ్చారు. దీంతో శనివారం సాయంత్రం ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ వెంకట సునీల్, తహసీల్దార్ చిరంజీవీ, ఆర్ఐ శ్రీనివాసులు పరిశీలించారు. వర్షం నిరంతరాయంగా కురుస్తున్నందున గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, చెరువుకు నీటి ఉధృతి పెరిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి, సూచించారు. అవసరమైతే సహాయ చర్యలు వెంటనే చేపడతామన్నారు. కాగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువుకు భారీగా వరదనీరు చేరుతోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు బలి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొదిలి: దర్శి–పొదిలి రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆముదాలపల్లి గ్రామానికి చెందిన పూసలపాటి ఇజ్రాయేల్ (30) పొదిలి వైపు నుంచి దర్శి వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఇజ్రాయేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇజ్రాయేల్‌కు రాజంపల్లిలో రెండు సంవత్సరాల క్రితం వివాహం అయింది. భార్య, సంవత్సరం పాప ఉంది. రాజంపల్లి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

నల్లమలలో వృద్ధురాలి మృతదేహం



గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వృద్ధురాలు (75) మరణించి ఘటన నల్లమల అభయారణ్యం పరిధిలోని చిన్నారుట్ల వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై అనికుమార్‌లు సంఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సీఐ ప్రభాకరరావు కథనం మేరకు.. వృతురాలి వయస్సు 75 సంవత్సరాలు ఉండి ఉండవచ్చని తెలిపారు. శుక్రవారం సాయంత్రం చిన్నారుట్ల గూడేనికి వచ్చిందని, ఈ క్రమంలో రాత్రి గూడెంలోని గిరిజనుల వద్ద భోజనాన్ని యాచించి.. రోడ్డుపైనే ఉన్న బస్సు షెల్టర్ వద్ద నిద్రించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కురుస్తున్న భారీ వర్షం, చలి తీవ్రతకు తట్టుకోలేక మరణించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



షేక్ బాషా (ఫైల్)

కొమరోలు: రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన షేక్ బాషా (38) తన బుల్లెట్ ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి తన స్వగ్రామమైన నల్లగుంట్లకు వెలుతున్న క్రమంలో కొమరోలు సమీపంలోని గ్రీన్ రెస్టారెంట్ వద్ద అదుపుతప్పి ద్విచక్ర వాహనం కిందపడటంతో షేక్‌బాషాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాషా శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం

కంభం: సుమారు 34 సంవత్సరాల వయసున్న మహిళ అదృశ్యం పై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బి. నరసింహారావు శనిశనివారం తెలిపారు. కందులాపురం పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ఓ ప్రయివేట్ స్కూల్ టీచర్ శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో మందుల కోసం మెడికల్ షాప్‌కు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా కనబడక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళకు మైగ్రేన్ తలనొప్పి సమస్య ఉందని పోలీసులు తెలిపారు.



పలుకురాళ్ల తండా ప్రాథమిక పాఠశాల ఇదే..



గొడవ పడుతున్న నాయకులను బయటకు పంపుతున్న ఎస్సై

ప్రభుత్వం మాది.. మీకెందుకు చైర్మన్ పదవి..?

- ఆక్రోశం వెళ్లగక్కిన టీడీపీ నాయకులు
- పలుకురాళ్ల తండా ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ వైఎస్సార్ సీపీ కైవసం
- రాజీలు చేసేందుకు అధికారులు నానా తంటాలు
- టీడీపీ బెదిరింపులకు లొంగని తండా వాసులు
- న్యాయం గెలిచిందంటూ గ్రామస్తుల సంతోషం



చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అబ్జర్వర్



బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై

ముండ్లమూరు (దర్శి): 'ప్రభుత్వం మాది.. మీకెందుకు ఎస్ఎంసీ చైర్మన్ పదవి' అంటూ టీడీపీ నేతలు ముండ్లమూరు మండలం పలుకురాళ్ల తండా ఎస్ఎంసీ ఎన్నికలు సందర్భంగా తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. మా వాళ్లు చైర్మన్ అయితేనే పాఠశాల అభివృద్ధి చెందుతుందని.. లేదంటే మీరంతా ఇబ్బందులు పడతారని విలేకరుల ముందే హెచ్చరికలు జారీ చేశారు. అయినా తండా వాసులు భయపడలేదు. గత రెండు సార్లుగా పలుకురాళ్ల తండా ఎస్ఎంసీ చైర్మన్ కైవసం చేసుకోవాలని టీడీపీ నాయకులు విశ్వ ప్రయత్నం చేశారు. మొదటి సారి కోరం ఉన్నా అధికారుల ఒత్తిడితో వాయిదా వేయించారు. రెండో సారి ఎంఈఓ, ఎంపీడీఓలతో గ్రామస్తులను బెదిరించి గ్రామంలో ఒక్క పథకం రాకుండా చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కూడా పెట్టమని టీడీపీ నేతలు బెదిరించారు. చివరకు కోరం ఉన్నా అధికారులు వాయిదా వేశారు. చైర్మన్‌గా టీడీపీ వారిని ఎన్నుకుంటేనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతామంటూ ఐదు రోజుల పాటు నిలిపివేశారు. దీంతో సాక్షి పత్రిక స్టేట్ పేజీలో ఆ కథనాన్ని ప్రచురించడంతో ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న వంట మనిషిని తీసేసి తమ పార్టీకి చెందిన వంట మనిషిని పెట్టుకుని వంట వండిస్తునారు.

మళ్లీ అదే తంతు

శనివారం మూడో సారి జరిగిన ఎన్నికల్లో కూడా టీడీపీ నేతలు తమ అధికార దర్పాన్ని ప్రదర్శించాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మమ్మల్ని చైర్మన్‌గా ఎన్నుకోవాలి లేదంటే ఎన్నికలు వాయిదా వేయాలని టీడీపీ నాయకులు అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న విలేకరులు.. మొత్తం 12 మంది సభ్యులకు 7 మంది సభ్యులు ఉంటే ఎన్నికలు ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. దీంతో టీడీపీ నాయకులు మీరెవరు మీపని మీరు చూసుకోండి అంటూ విలేకరులపై మండి పడ్డారు. దీంతో ఎస్సై వై. నాగరాజు కలిపించుకుని గొడవలు చేస్తే అంతా ఇబ్బందులు పడతారని ప్రశాంతంగా ఎన్నికలు చేసుకోవాలని హెచ్చరించారు. మెంబర్లు మినహా మిగితా టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరూ ఇక్కడ గొడవలు పెట్టుకోవద్దని బయటకు పంపారు. మీరు రాజీలు చేసుకోవాలనుకుంటే సమన్వయంతో మాట్లాడుకుని చేసుకోవాలని స్పష్టం చేశారు. గొడవలు పెట్టుకుంటే అందరినీ అరెస్ట్ చేసి తీసుకెళ్తామని హెచ్చరించారు. దీంతో అబ్జర్వర్ తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నిక నిర్వహించారు. మొత్తం 12 నంబర్లు ఉండగా 8 వైఎస్సార్ సీపీ మద్దతు దారునికి, నాలుగు టీడీపీ మద్దతు దారునికి మద్దతు ఉంది. ఓడిపోతామని తెలిసి ఆ నలుగురు టీడీపీ వారు ఎన్నికలకు హాజరు కాలేదు. 7 గురు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు హాజరయ్యారు. వారిలో చైర్మన్‌గా బి. సోమ్లానాయక్, వైస్ చైర్మన్‌గా వి. కొండాబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారందరితో అబ్జర్వర్ సంతకాలు పెట్టించుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

తుఫాన్ ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ సన్నద్ధం



ఎస్పీ ఏఆర్ దామోదర్ (ఫైల్)

ఒంగోలు టౌన్: తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ సర్వసన్నద్ధంగా ఉందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనే బృందాలకు అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, సహాయక చర్యల కోసం తాళ్లు, బ్యాటన్లు, జేసీబీలను సంసిద్ధంగా ఉంచినట్లు వివరించారు. నదులు, వాగులు, వంకలు, చెరువుల్లో ఈత కొట్టడం ప్రమాదకరమని, ఎవరూ చేజేతులా ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లో.. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసమైన ప్రాంతాల్లో సహాయక శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సముద్రతీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీసులు, ఇతర అధికారులకు సహకరించాలని, ఆయా ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు, తుఫాను షెల్టర్లకు తరలి వెళ్లాలని సూచించారు. చెరువులు, కాలువలకు గండిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయాలని, రెవెన్యూ ఇతరా శాఖల అధికారలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వాగులు, వంకలున్న ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులకు విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్‌ను మరలించి ప్రయాణాలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. నీట మునిగిన రహదారుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేయాలని, వాహనాలను ఇతరా సురక్షిత మార్గాల ద్వారా ప్రయాణించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉధృతంగా నదులు ప్రవహించే నదీ పరివాహక ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

తాగు నీరు స్వాహా!



చుక్కనీరు లేక అడుగంటిన మర్లపాడు చెరువు



కాలువ కట్ట తెగగొట్టి అక్రమంగా కొణిజేడు గ్రామానికి నీరు తరలిస్తున్న దృశ్యం

- అక్రమంగా సాగర్ నీటిని కొణిజేడు చెరువుకు నింపుతున్న టీడీపీ నేత
- చోద్యం చూస్తున్న అధికారులు
- మరో వైపు మర్లపాడులో అడుగంటిన భూగర్భ జలాలు
- రెచ్చిపోతున్న టీడీపీ నేత రామా గోపి



అడుగంటిన బావి

టంగుటూరు: అధికార బలంతో టీడీపీ నాయకుడు రామా గోపీ పోకడలకు మర్లపాడు గ్రామ ప్రజలు తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. వివరాలు.. మర్లపాడు గ్రామంలో భూగర్భ జలాలు, సాగు తాగు నీటి చెరువులు అడుగంటి పోతున్నాయి. ఈ దశలో తాగునీటి చెరువులను నింపేందుకు ప్రభుత్వం సాగర్ నీరు విడుదల చేసింది. అయితే 15 రోజులుగా కొణిజేడు గ్రామానికి చెందిన టీడీపీ నేత రామా గోపి మర్లపాడు వస్తున్న నీటికి అడ్డుకట్ట వేసి కొణిజేడు గ్రామ చెరువును అవసరానికి మించి దర్జాగా నింపుకుంటున్నాడు. ప్రశ్నించిన మర్లపాడు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. మీడియా దృష్టికి తీసుకెళ్లారని రెచ్చిపోతున్నాడు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



కేవీజీ సత్య నారాయణ, ఎస్ఈ

ఒంగోలు సబర్బన్: ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. నాలుగు రోజుల పాటు సిబ్బందికి సెలవులు కూడా లేవన్నారు. విద్యుత్ సిబ్బంది వారి సంబంధిక సబ్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులు విద్యుత్ మోటార్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు ఎలాంటి అవసరం అయినా టోల్ ఫ్రీ నంబరు–1912కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ లైన్ల విషయంలో, ఇళ్ళ వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు, సర్వీసు వైర్లు, విద్యుత్ ఎర్త్ వైర్ల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. 9440811749, 08592–233248 నంబర్లతో పాటు కందుకూరు, ఒంగోలు, కనిగిరి, దర్శి, మార్కాపురం ఈఈ కార్యాలయాలకు కూడా ఫోన్ చేసి సమాచారాన్ని అందించవచ్చన్నారు.

హామీలెప్పుడు నెరవేరుస్తారు?

- మంత్రి డోలాను నిలదీసిన దివ్యాంగుడు



దేవరాజుగట్టులో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

పెద్దారవీడు: ఎన్నికల ముందు మార్కాపురాన్ని జిల్లా చేస్తామని, పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని వాగ్దానం చేశారని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదని మంత్రిని ఓ దివ్యాంగుడు నిలదీశారు. మండల పరిధి దేవరాజుగట్టులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోగా.. మంత్రి మాట్లాడుతూ త్వరలోనే ఆ హామీలపై దృష్టి పెడతామని చెప్పారు. ఎంపీడీఓ రాజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు, మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మెట్టు లక్ష్మీదేవి, మాజీ జెడ్పీటీసీ జడ్డా రవి, నాయకులు గుమ్మా గంగరాజు, దుగ్గెంపూడి కొండారెడ్డి, దండా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తిలో హాస్టల్‌ను సందర్శించిన మంత్రి

చీమకుర్తి: హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. చీమకుర్తిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఇటీవల హాస్టళ్లలో అతిసార వ్యాపిస్తున్న సందర్భాలు ఉండటంతో హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు తెలిపారు. ఎస్సీ బాలుర హాస్టల్ భవనంలో తలుపులు, స్లాబులు లేని టాయ్‌లెట్లను చూసి వాటి మరమ్మతులకు నిధులు కేటాయించేందుకు ప్రయత్నిస్తామన్నారు. హాస్టల్‌లో వంటగది, స్టోర్‌రూం, విద్యార్థులకు వినియోగించే ఆహార పదార్థాలను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వెంట డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మానాయక్ ఉన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



దివ్యాంగుల హాస్టల్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక సంతపేటలోని దివ్యాంగుల హాస్టల్‌లో ఉన్న లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. హాస్టల్‌లోని 13 మందికి అందజేశారు. భాగ్యనగర్‌లో మంచానికే పరిమితమైన వారికి, ధారావారితోటలోని మరికొందరికి కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పింఛన్ల పంపిణీ

ఒంగోలు టౌన్: ఈనెల 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభించి రాత్రి 8 గంటల వరకు 89.72 శాతం వరకు చేసినట్లు డీఆర్డీఏ పీడీ వసుంధర తెలిపారు. నగరంలోని భాగ్యనగర్, ధారావారిపేట, సంతపేటలో జరిగిన పింఛన్ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. తుఫాన్ కారణంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మరో రెండు రోజులపాటు పొడిగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు డీఆర్డీఏ పీడీ వసుంధర, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం డీఆర్డీఏ పీడీ టంగుటూరు మండలంలోని కొణిజేడు, పుల్లారెడ్డిపాలెం, కేసుపల్లి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.